## జిల్లాలో 334 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తి

కామారెడ్డి, మే 31 : జిల్లాలోని 334 కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ పూర్తయిందని అదనపు కలెక్టర్ చంద్రమోహన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన 16 కేంద్రాల్లో కూడా ఉన్న కొద్దిపాటి ధాన్యాన్ని మిల్లులకు తరలించే ప్రక్రియ వేగవంతంగా సాగుతున్నదని తెలిపారు. తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో ట్రాన్స్‌పోర్ట్ కాంట్రాక్టర్లు, మిల్లర్లు కేంద్రాల నిర్వాహకులతో సమన్వయం చేసుకుంటూ త్వరగా కొనుగోళ్లు పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 54,150 మంది రైతుల నుంచి రూ.687 కోట్ల విలువైన 3,11,592 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతుల ఖాతాలో రూ. 638 కోట్లు జమ చేశామని అన్నారు. 98 శాతం ట్యాబ్ ఎంట్రీ కూడా పూర్తయిందని, ఒకటి రెండు రోజుల్లో మిగతా రైతులకు డబ్బులు వేస్తామని తెలిపారు.

## ఘనంగా వరల్డ్ టొబాకో డే



ర్యాలీలో పాల్గొన్న వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ చంద్రశేఖర్

కామారెడ్డి, మే 31 : ప్రపంచ టొబాకో దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలోని (యూపీహెచ్‌సీ) రాజీవ్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా వైద్యాశాఖ అధికారి డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టొబాకోతో దేశంలో చాలా మంది మరణిస్తున్నారని అన్నారు. దీనిని అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేసి, ప్రజలకు అవగాహన కల్పించేందుకు ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ శిరీష, డాక్టర్ శోభారాణి, మెడికల్ ఆఫీసర్, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

## సేంద్రియ ఎరువులతోనే అధిక దిగుబడులు


అంతంపల్లిలో రైతుకు సేంద్రియ ఎరువును విక్రయిస్తున్న ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్

భిక్కనూరు, మే 31 : సేంద్రియ ఎరువుల వాడకంతో అధిక దిగుబడులు వస్తాయని ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని అంతంపల్లి గ్రామాన్ని శుక్రవారం ఎంపీడీవో సందర్శించారు. కంపోస్ట్ షెడ్డులో తయారు చేసిన ఎరువులను రైతులకు విక్రయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో సేకరించిన తడి, పొడి చెత్తను కంపోస్ట్ షెడ్డుకు తరలించి అక్కడ సేంద్రియ పద్ధతిలో ఎరువులు తయారు చేసి రైతులకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. దీంతో గ్రామ పంచాయతీకి ఆదాయం, రైతులకు సేంద్రియ ఎరువుతో లాభం చేకూరుతుందని చెప్పారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులను పరిశీలించారు. ఏఈపీఆర్ సోహేల్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

# నిరాడంబరంగా ఆవిర్భావ వేడుకలు

### కలెక్టర్ జితేశ్ వీ పాటిల్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

కామారెడ్డి, మే 31 : ఈ నెల 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అన్నారు. కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశపు హాలులో రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై వివిధ శాఖల అధికారులతో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు అవతరణ దినోత్సవ వేడుకలను నిరాడంబరంగా నిర్వహించుకోవాలని సూచించారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ప్రతి ఒక్కరినీ వేడుకల్లో భాగస్వాములను చేయాలన్నారు. గ్రామాల్లో సర్పంచుల పదవీకాలం ముగిసినందునా ప్రత్యేకాధికారులు పతాకావిష్కరణ చేయాలన్నారు. ప్రజాప్రతినిధులు పాల్గొనే కార్యక్రమాల్లో ఎలాంటి రాజకీయ ప్రసంగాలు లేకుండా చూడాలన్నారు.
ఒక్క కలెక్టరేట్ మినహా అంతటా ఉదయం 9 గంటల్లోగా పతాకావిష్కరణ చేయాలన్నారు. పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న అమరవీరుల స్థూపం వద్ద శ్రద్ధాంజలి, 9 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో జాతీయ పతాకావిష్కరణ జరగాలని, అనంతరం పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించాలని అన్నారు. ఈ నెల 1, 2వ తేదీల్లో కలెక్టరేట్‌ను మూడు రంగుల విద్యుత్ దీపాలతో అలంకరించాలన్నారు. అవార్డుల ప్రదానం, సాంస్కృతిక కార్యక్రమాలు ఉండవని తెలిపారు. ఎండలు తీవ్రంగా ఉన్నందున అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అగ్నిమాపక శాఖ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆర్డీవో రంగనాథరావు, డీఎస్పీ యాకుబ్‌రెడ్డి, కలెక్టరేట్ ఏవో మసూర్ అహ్మద్, జిల్లా అధికారులు దయానంద్, వరాదారెడ్డి, భాగ్యలక్ష్మి, కోటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

కామారెడ్డి రూరల్, మే 31 : కామారెడ్డి మండలం క్యాసంపల్లిలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ శుక్రవారం తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కింద చేపట్టిన పనుల పురోగతిని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడ కొనసాగుతున్న టాయిలెట్స్, ఎలక్ట్రిసిటీ, ప్లంబింగ్ పనులను పరిశీలించారు. రెండు రోజుల్లో పనులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. పాఠశాల ఆవరణ సువిశాలంగా ఉన్నందున రాబోయే మూడు నాలుగు రోజుల్లో యువత భాగస్వామ్యంతో శ్రమదానం, మొక్కల పెంపకం విరివిగా చేపట్టాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈవో రాజు, ఎంపీడీవో నాగవర్ధన్, ఎంపీవో మలహరి, ఎంఈవో ఎల్లయ్య, పంచాయతీరాజ్ ఏఈ ఆదిత్యరెడ్డి పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకోవాలి


కామారెడ్డి, మే 31 : బెస్ట్ అవైలబుల్ పథకం కింద 2024–25 విద్యా సంవత్సరానికి 1వ తరగతి డే స్కాలర్ ఇంగ్లిష్ మీడియంలో, 5వ తరగతిలో రెసిడెన్షియల్ ఇంగ్లిష్ మీడియంలో ప్రవేశానికి అర్హులైన షెడ్యూల్డ్ కులాల బాలబాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా ఎస్సీ అభివృద్ధి అధికారిణి రజిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో ప్రవేశానికి జూన్ 1,2018 నుంచి మే 31,2019 మధ్య జన్మించిన వారు అర్హులని తెలిపారు. కుటుంబ వార్షికాదాయం పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో లక్షన్నర ఉండాలన్నారు. జనన ధ్రువీకరణ, రేషన్, ఆధార్ కార్డు జిరాక్స్‌లను దరఖాస్తు వెంట జతపర్చాలని తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 4వ తరగతి ప్రోగ్రెస్ కార్డు, బోనాఫైడ్ జిరాక్స్‌లను జతపర్చాలని పేర్కొన్నారు. ఈ నెల 7వ తేదీ సాయంత్రం 5 గంటలలోగా కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలన్నారు. ఈ నెల 11న మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతిన ఎంపిక చేస్తారని తెలిపా రు. దరఖాస్తు ఫారాలను కార్యాలయంలో పొందాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 8328015942 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## బ్యాటరీ ట్రై సైకిల్ రిపేరింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు..

కామారెడ్డి, మే 31 : బ్యాటరీ ట్రై సైకిల్ రిపేరింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు మెకానిక్‌లో అనుభవం ఉన్న దివ్యాంగుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మహిళా శిశు, దివ్యాంగుల సంక్షేమాధికారి బావయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఇద్దరు దివ్యాంగులకు శిక్షణ ఇవ్వడంతోపాటు దివ్యాంగుల ఆర్థిక పునరావాస పథకం కింద రుణం అందిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్న దివ్యాంగులు ఈ నెల 3న సాయంత్రంలోగా కలెక్టరేట్‌లోని 31వ నంబర్ గదిలో ఉన్న జిల్లా సంక్షేమాధికారి కార్యాలయంలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు పనివేళల్లో అధికారులను సంప్రదించాలని సూచించారు.

## సమయ పాలన పాటించని తహసీల్దార్

- పైఅధికారులు వస్తే ముందుగా విధులకు హాజరు
- ఎన్నిక కోడ్ తర్వాత బదిలీపై వెళ్తామని విధుల్లో నిర్లక్ష్యం


ఉదయం 11:30 గంటలైనా ఖాళీగా ఉన్న కుర్చీ

బీబీపేట్, మే 31 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో తహసీల్దార్ తీరుపై జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్‌తో పాటు ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేసినా ఆయన తీరు మార్చుకోవడం లేదు. శుక్రవారం ఉదయం 11:30 గంటలైనా తన కార్యాలయానికి తహసీల్దార్ సత్యనారాయణ రాకపోవడం గమనార్హం. తమ ఇష్టానుసారం కార్యాలయానికి వచ్చి.. వెళ్తుండడంతో ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రిజిస్ట్రేషన్ కోసం వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులు తమ స్లాట్ బుకింగ్ 10 గంటలకు ఉండగా వారి రిజిస్ట్రేషన్ ఆలస్యం అవుతుందని వాపోతున్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించడం లేదని, పైఅధికారులు వస్తే మాత్రం వస్తారని ప్రజలు ఆరోపించారు. ఎలాగైనా ఎన్నికల కోడ్ తర్వాత బదిలీ అవుతామని తహసీల్దార్ తనకు నచ్చినప్పుడు విధులకు హాజరవుతుండడంతో విద్యార్థులు, ప్రజలు, రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మరి కొందరు ఉద్యోగులు ఉదయం 9:30 గంటలకు వచ్చి పనులు చేస్తున్నారు. ఆర్ఐ అంజయ్‌కుమార్ ఉదయం వచ్చి కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన అనంతరం కార్యాలయానికి వస్తున్నారు. తహసీల్దార్ సత్యనారాయణ తీరు మార్చు కోవాలని ప్రజాప్రతినిధులు, మండల ప్రజలు కోరుతున్నారు.

## 7న జడ్పీ సమావేశం

కామారెడ్డి, మే 31 : జిల్లా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 7వ తేదీ ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో జడ్పీ చైర్‌పర్సన్ దఫేదార్ శోభ అధ్యక్షతన సమావేశం నిర్వహించనున్నట్లు జడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి చందర్ నాయక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు, అధికారులు సకాలంలో సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు. అధికారులు సమగ్ర వివరాలతో సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


గజ్యానాయక్ తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఏవో రమ్యశ్రీ

మాచారెడ్డి, మే 31 : ఫెర్టిలైజర్ దుకాణాల్లో రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, మండల వ్యవసాయశాఖ అధికారిణి రమ్యశ్రీ హెచ్చరించారు. మండలంలోని గజ్యానాయక్‌తండా, ఎక్స్‌రోడ్ గ్రామంలోని పలు దుకాణాల్లో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు డీలర్లతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన విత్తనాలను విక్రయించొద్దని తెలిపారు. నాణ్యమైన విత్తనాలను మాత్రమే విక్రయించాలని సూచించారు. అనంతరం ఎరువులు, విత్తనాల బస్తాలను పరిశీలించారు.

**విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి**

నస్రుల్లాబాద్, మే 31 : రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని ఏఈవో శ్రావణ్ కుమార్ అన్నా రు. బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తండాలో శుక్రవారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు సూచించిన విత్తనాలను కొనుగోలు చేయాలన్నారు. క్రిమి సంహారక మందు లు, ఎరువులు కొనుగోలు చేసేముందు గడువు తేదీ గమనించాలన్నారు. విత్తనాల ప్యాకెట్లు, రసీదులు పంట కాలం పూర్తయ్యేవరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యకరమంలో రైతులు పాల్గొన్నారు.

## ముగిసిన వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం


క్రీడాకారులతో వ్యాయామోపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్

గాంధారి, మే 31: మండలంలోని రాంపూర్‌గడ్డ గ్రామంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో నెల రోజులుగా నిర్వహిస్తున్న వాలీబాల్ వేసవి శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా పీఈటీ లక్ష్మణ్ రాథోడ్ మాట్లాడుతూ .. క్రీడాకారులకు వాలీబాల్‌లో మెలుకువలను నేర్పించామని అన్నారు. శిక్షణ పొందిన క్రీడాకారులు భవిష్యత్తులో రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తారని ఆశాభావం వ్యక్తంచేశారు. క్రీడలతో విద్యార్థులకు క్రమశిక్షణ, సమయస్ఫూర్తి, మానసిక, శారీరక ఉల్లాసం కలుగుతాయని తెలిపారు. శిక్షణ శిబిరం నిర్వహణకు సహకరించిన జిల్లా క్రీడా యువజన శాఖ అధికారి దామోదర్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## గాంధారి ప్రీమియర్ లీగ్ టోర్నీ విజేత శివ జట్టు


జట్లకు ట్రోఫీలను అందజేస్తున్న ఎస్సై ఆంజనేయులు

గాంధారి, మే 31: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల మైదానంలో పది రోజులుగా నిర్వహిస్తున్న గాంధారి ప్రీమియర్ లీగ్(జీపీఎల్) టోర్నీ విజేతగా శివ జట్టు నిలిచింది. శుక్రవారం నిర్వహించిన ఫైనల్ పోటీలో రాహుల్ జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకున్నది. గాంధారి ఎస్సై ఆంజనేయులు విజేత, రన్నరప్ జట్లకు ట్రోఫీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. చదువుతోపాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలతో మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో వడ్ల ప్రకాశ్, కమ్మరి నాగరాజు, నితిన్‌రావు, అభిలాష్, ఆకుల రాజేశ్, నిఖిల్‌రావు, సంతోష్‌గౌడ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

# విత్తనాలు కొనే ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



డోంగ్లీ మండలం పెద్ద టాక్లీలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఈవో నాందేవ్, బిచ్కుంద మండలం హస్గుల్‌లో ఏఈవో సౌమ్య..

ఎల్లారెడ్డి/ బిచ్కుంద/డోంగ్లీ/రామారెడ్డి, మే 31: రైతులు విత్తనాలు కొనే ముందు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ఈమేరకు వానకాలంలో పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. బిచ్కుంద మండలంలోని హస్గుల్ గ్రామంలో ఏఈవో సౌమ్య రైతులతో మాట్లాడారు. ఆధీకృత డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన దుకాణం నుంచి రసీదును తప్పకుండా తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలన్నారు.
డోంగ్లీ మండలంలోని పెద్ద టాక్లీ గ్రామంలో ఏఈవో నాందేవ్ విత్తనాల కొనుగోలులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలు నాటితే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.
ఎల్లారెడ్డి మండలంలోని లింగారెడ్డిపేట గ్రామంలో ఏఈవో రాజాగౌడ్ రైతులతో

**రైతులకు వ్యవసాయాధికారుల అవగాహన**

సమావేశం ఏర్పాటుచేశారు. లైసెన్సు కలిగి ఉన్న డీలర్ల వద్దనే ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేయాలని అవగాహన కల్పించారు. నాణ్యమైన విత్తనాలను ఎంచుకోవాలని, ఇందుకోసం వ్యవసాయాధికారుల సూచనలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.
సదాశివనగర్ మండలంలోని పలు గ్రామాల రైతులకు వానకాలంలో పంటల సాగు, విత్తనాల ఎంపిక తదితర అంశాలపై ఏఈవోలు అవగాహన కల్పించారు. కొనుగోలు చేసిన ఎరువులు, విత్తనాలకు సంబంధించిన రసీదును తప్పకుండా తీసుకొని, పంట సాగు పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా క్లస్టర్ల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

# నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా వినీత


ఇన్‌చార్జి ఎంపీపీగా బాధ్యతలను స్వీకరిస్తున్న వైస్ ఎంపీపీ వినీత

నాగిరెడ్డిపేట, మే 31: నాగిరెడ్డిపేట ఇన్‌చార్జి ఎంపీపీగా పోచారం ఎంపీటీసీ సభ్యురాలు టేకులపల్లి వినీత శుక్రవారం పదవీ బాధ్యతలను స్వీకరించారు. ఎంపీడీవో పర్బన్న ఆమెకు బాధ్యతలను అప్పగించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. వినీత మే 29వ తేదీన వైస్ ఎంపీపీగా ఎన్నికయ్యారని తెలిపారు. కాగా ఆమెకు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలను అప్పగించాలని జడ్పీ సీఈవో కార్యాలయం నుంచి శుక్రవారం ఉదయం ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆమెకు ఇన్‌చార్జి ఎంపీపీ బాధ్యతలను అప్పగించామని తెలిపారు. జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కలిసి ఇన్‌చార్జి ఎంపీపీని ఘనంగా సన్మానించారు. మిఠాయిలు పంచుకొని, పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. నాయకులు కృష్ణ, వెంకట్‌రెడ్డి, కిరణ్, శ్రీనివాస్, నారాయణ, బాబూరావు, ఫరీద్, లక్ష్మీకాంతం, స్కైలాబ్‌గౌడ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## దైవదర్శనానికి వెళ్లి.. గుండెపోటుతో మృతి


రూపమ్(ఫైల్)

మద్నూర్, మే 31: దైవ దర్శనానికి వెళ్లిన యువకుడు గుండెపోటుతో మృతిచెందాడు. మద్నూర్‌కు చెందిన చౌడేకర్ రూపమ్(31) మిత్రులతో కలిసి తీర్థయాత్రకు నాలుగు రోజుల క్రితం వెళ్లాడు. గురువారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. దర్శనం టికెట్ల కోసం క్యూలైన్లో నిల్చున్న అతడు.. హఠాత్తుగా గుండెనొప్పితో కుప్పకూలిపోయాడు. దవాఖానకు తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారని అతడి మిత్రులు తెలిపారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో మద్నూర్‌కు తీసుకురాగా.. అంత్యక్రియలను నిర్వహించారు. అతడి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## లింబూర్ మాజీ సర్పంచ్..

డోంగ్లీ, మే 31: లింబూర్ మాజీ సర్పంచ్ రామ్‌పటేల్ గురువారం రాత్రి గుండెపోటుతో మృతిచెందారు. జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు.. రామ్‌పటేల్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.

## 'ఆరోపణలు రుజువు చేయకుంటే పరువు నష్టం దావా వేస్తాం..'

ఎల్లారెడ్డి రూరల్, మే 31: తమపై చేసిన ఆరోపణలు నిజమని రుజువు చేయకుంటే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులపై పరువు నష్టం దావా వేస్తామని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు కుర్మ సాయిబాబా అన్నారు. ఎల్లారెడ్డిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాము చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేని పలువురు తమపై బురద జల్లే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. దవాఖాన సిబ్బందితో తాము సొంత పనులు చేయించుకుంటున్నామని అనడం సత్యదూరమన్నారు. సాక్ష్యాలు, రుజువులు ఉంటే బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. సమావేశంలో జడ్పీటీసీ ఉషాగౌడ్, సొసైటీ డైరెక్టర్ నాగం గోపీకృష్ణ, పార్టీ ఎల్లారెడ్డి పట్టణ అధ్యక్షుడు వినోద్‌గౌడ్ పాల్గొన్నారు.

## పెద్దమ్మకు బోనాలు

గాంధారి, మే 31: మండలంలోని సీతాయిపల్లిలో ముదిరాజ్ కులసంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మకు శుక్రవారం బోనాలను సమర్పించారు. మహిళలు ఇంటికొక బోనం చొప్పున ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



బిచ్కుంద పోలీస్‌స్టేషన్‌ను ట్రైనీ ఎస్పీ కాజల్‌సింగ్ శుక్రవారం తనిఖీ చేశారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించొద్దని ఎస్సై మోహన్‌రెడ్డి, సిబ్బందికి సూచించారు.
*- బిచ్కుంద, మే 31*

## యూనిఫామ్‌ల పరిశీలన


దుస్తులను పరిశీలిస్తున్న డీఆర్డీవో చందర్‌నాయక్

నాగిరెడ్డిపేట/రామారెడ్డి, మే 31: నాగిరెడ్డిపేటలో విద్యార్థుల కోసం కుడుతున్న యూనిఫామ్‌లను అడిషనల్ డీఆర్డీవో మురళీకృష్ణ, ఎంపీడీవో పర్బన్న శుక్రవారం పరిశీలించారు. జూన్ 10వ తేదీ వరకు దుస్తులను సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీపీఎం వకుళ, ఏపీఎం జగదీశ్, సీసీలు దత్తు, నారాయణ, రమేశ్, శ్రీనివాస్ రెడ్డి, సాయిలు, రషీద్, సుజాత, అకౌంటెంట్ రాజు తదితరులు ఉన్నారు. సదాశివనగర్‌లో మహిళా స్వశక్తి సంఘం వారి కుట్టు మిషన్ కేంద్రంలో సిద్ధం అవుతున్న యూనిఫామ్‌లను డీఆర్డీవో చందర్‌నాయక్ పరిశీలించారు. పాఠశాలల ప్రారంభం వరకు దుస్తులను అందించాలని సూచించారు. ఏపీఎం రాజిరెడ్డి, సీసీ నరేందర్, మహిళా సంఘం అధ్యక్షురాలు లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**WANTED**
★త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-327724-All

**CHANGE OF NAME**
★I, MANJUR AHMED NIZAR AHMED, S/o. Nisar Ahmed Asgar Ali, H.No. 1-4-464, PMH Colony, Kamareddy-503 111, Telangana, have Changed My name to MOHAMMED as Surname and MANZOOR AHMED as given Name for all purposes.
NT-939

**CHANGE OF NAME**
★I, ANJUM ARA, W/o. Manzoor Ahmed Mohammed, H.No. 1-4-464, PMH Colony, Kamareddy-503 111, Telangana, have Changed My Name to ARA as Surname and ANJUM as given Name for all purposes.
NT-938

**శుభవార్త**
★నిరుద్యోగ యువతి, యువకులకు జీవితంలో ఆర్థికంగా స్థిరపడే గొప్ప వ్యాపార అవకాశం కలదు. ఆసక్తి గల వారు వెంటనే సంప్రదించండి: సెల్: 9059962194.
NTK-311380

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును

**గమనిక**
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.